# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.**

2. **తెలంగాణ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

4. **ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించనున్నారు. 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం ఉండవల్లి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి సరన్నపేట సమీపంలోని తామ్రపల్లి చేరుకోనున్నారు. అనంతరం నరసన్నపేటలో జరిగే ప్రజావేదిక సమావేశం, 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం స్థానిక ప్రజలతో సమావేశమై సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించనున్నారు. తరువాత తామ్రపల్లిలో నిర్వహించే పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం తిరిగి ఉండవల్లి క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

--------------------------

తెలంగాణ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'రానున్న పదేళ్లలో తెలంగాణ ఎలా ఉండబోతోంది' అనే అంశంపై హైదరాబాదులో ఒక మీడియా సంస్థ నిన్న నిర్వహించిన కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వంలో సంక్షేమం నిరంతర ప్రక్రియ కాగా, అభివృద్ధి దీర్ఘకాలిక ప్రణాళికలతో కొనసాగాలని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ప్రపంచ స్థాయి మేధావులు, కార్పొరేట్ సంస్థల సూచనలతో రూపొందించామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, మెట్రో, హైవేలు, ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ వంటి మౌలిక వసతుల అభివృద్ధితో భారీ పెట్టుబడులు ఆకర్షిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

--------------------------

చమురు దిగుమతులపై భారం తగ్గించేందుకు పెట్రోలియం ఉత్పత్తుల్లో ఇథనాల్ మిశ్రమాన్ని 20 నుంచి 40 శాతానికి పెంచాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరారు. ఈ అంశంపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో నిన్న ఫోన్‌లో మాట్లాడారు. బ్రెజిల్ వంటి దేశాల్లో అధిక స్థాయిలో ఇథనాల్ మిశ్రమం అమలవుతోందని ప్రస్తావించిన ముఖ్యమంత్రి, ఇథనాల్ వినియోగం పెరగడం వల్ల పెట్రోలియం దిగుమతులపై ఆధారపడటం తగ్గి విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందన్నారు. ఇప్పటికే ఇథనాల్ మిశ్రమం వల్ల లక్ష 10 వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం ఆదా కావడంతో పాటు 5 వందల లక్షల టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గాయని వివరించారు. ఇథనాల్ వినియోగం వల్ల మొక్కజొన్న రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

---------------------------

గతేడాది జనవరి నుంచి ప్రతి నెలా 3వ శనివారం నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో గణనీయమైన మార్పు తీసుకువచ్చిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ అంశంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన దృశ్యమాధ్యమ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని, 16 నెలలుగా సాధించిన ఫలితాల నుంచి స్ఫూర్తి పొంది మరింత కృషి చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో నిన్న నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..27 సెకన్లు

---------------------------

ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండల కేంద్రంలో నిన్న నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం 10వ తరగతి పరీక్షల్లో.. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో మొదటి 5 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 10 వేల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో నిన్న సమావేశమైన ఆయన, వారికి 306 కోట్ల రూపాయల పరిహారం,

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెక్కులను అందించారు. పలువురు లబ్ధిదారులకు ఆర్ అండ్ ఆర్ కాలనీల ఇళ్ల తాళాలను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందన్నారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా 3 వేల కోట్ల రూపాయలతో రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి బి.సి జనార్థన్ రెడ్డి తెలిపారు. త్వరలో మరో 2 వేల కోట్ల రూపాయలతో వంతెనల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఒంగోలు–నంద్యాల రహదారిని మహానందితో కలిపే.. సుమారు 8 కోట్ల వ్యయంతో నిర్మించిన 3 కిలోమీటర్ల రోడ్డును మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు నమోదవుతున్నాయి. వచ్చే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్–నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలపై నైరుతి రుతుపవనాల పురోగమనానికి పరిస్థితులు అనుకూలంగా మారనున్నట్లు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంపై ఏర్పడిన అల్పపీడనం కొనసాగడంతో పాటు దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలిపారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================